# బలవంతంగా మూసివేస్తే చర్యలు తప్పవు

## ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జులై 23:**



స్వచ్ఛందంగా కళాశాలలు,పాఠశాలలు మూసివేస్తే పర్వాలేదని అట్లా కాకుండా విద్యార్థి సంఘాల నాయకులు బలవంతంగా మూసివేస్తే చర్యలు తప్పవని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఎన్.ఉమాహారతి తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటనలో మాట్లాడుతూ..కొన్ని విద్యార్థి సంఘాలు, పార్టీల నాయకులు ప్రతీ చిన్న విషయానికి, ఎక్కడో ఏదో జరిగితే సాకుగా చూపించి విద్యాలయాలను మూసివేయిస్తున్నట్లు తన దృష్టికి వచ్చింది అన్నారు. అసలు సంఘాల నాయకులకు అనుమతులు లేకుండా ప్రభుత్వ కళాశాలలు మరియు పాఠశాలలోకి వెళ్ళడానికి వీలు లేదని, ఎవరైనా బలవంతంగా చొరబడి బెల్ కొట్టిన, తరగతి గదులలోకి వచ్చిన, బయటకు వెళ్ళండి అని మైకులో చెప్పిన పోలీసులకు పిర్యాదు చేయాలన్నారు.




సిద్దిపేట సంగారెడ్డి మెదక్

శుక్రవారం 24 జూలై 2026

పేజీలు : 8


# సరిహద్దు రహదారి శిథిలం

## నరకయాత్రలో చీకుర్తి గ్రామస్తులు

### సంవత్సరాలు గడుస్తున్న.. మరమ్మతులకు నోచుకోని.. :

### చాల్కి--చీకుర్తి--బీదర్ రహదారి

### 9 కి.మీ.లో వందలాది గుంతలతో నిత్యం ప్రమాదకర ప్రయాణం





**జహీరాబాద్, జులై 23(ప్రజా జ్యోతి న్యూస్ )**

నియోజకవర్గ కేంద్రమైన తెలంగాణ--కర్ణాటక రాష్ట్రాలను అనుసంధానించే న్యాల్కల్ మండలంలోని చాల్కి--చీకుర్తి--బీదర్ ఆర్అండ్‌బీ రహదారి గత 15 సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకుంది. కేవలం 9 కిలోమీటర్ల ఈ రహదారిపై వందలాది గుంతలు ఏర్పడటంతో ప్రతిరోజూ వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్న గ్రామస్తులు**

చాల్కి గ్రామ కూడలి నుంచి చీకుర్తి, హుస్సేన్ నగర్ మీదుగా బీదర్‌కు వెళ్లే ఈ రహదారి రాష్ట్ర సరిహద్దు ప్రాంత ప్రజలకు ప్రధాన మార్గం. రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, కూలీలు నిత్యం ఈ మార్గాన్నే వినియోగిస్తున్నారు. అయితే రహదారి పూర్తిగా దెబ్బతినడంతో ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవు తున్నారు. స్థానికుల కథనం ప్రకారం దాదాపు 15 సంవత్సరాల క్రితం అప్పటి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి హయాంలో ఈ రహదారికి బీటీ పనులు చేపట్టారు. అనంతరం 2010 తర్వాత సమగ్ర మరమ్మ తులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గుంతలను కూడా పూడ్చకపోవడంతో పరిస్థితి మరింత దిగజారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రహదారి మరమ్మతుల కోసం పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతులు అందజేసినా స్పందన లేక పోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక నిధులు కేటాయించి చాల్కి--చీకుర్తి--బీదర్ రహదారిని పునర్నిర్మించి, ప్రజలకు సురక్షిత రాకపోకలు కల్పించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

## జగ్గారెడ్డి - నిర్మల ఆధ్వర్యంలో సంగారెడ్డి లో 1000 మందితో మహా పాదయాత్ర



## జగ్గారెడ్డి - నిర్మల ఆధ్వర్యం లో సంగారెడ్డి లో 1000 మందితో మహా పాదయాత్ర

రాహుల్ గాంధీ కి మద్దతుగా నల్ల టీ షర్ట్స్ ధరించి క్లాసిక్ గార్డెన్స్ నుండి గంజి మైదాన్ వరకు పాదయాత్ర నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

ప్లకార్డులు, నినాదాలతో హోరెత్తిన సంగారెడ్డి

రాహుల్ గాంధీ కి మద్దతుగా గత మూడు రోజులనుండీ సంగారెడ్డి లో కొనసాగుతున్న ఆందోళనలు

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:** నీట్ పేపర్ లీకేజీ ఘటన బాధితులపై చర్యలు తీసుకోవాలంటూ... రాహుల్ గాంధీ చేసిన నిరసనలకు మద్దతుగా సంగారెడ్డిలో మూడో రోజు ఆందోళనలు కొనసాగాయి. ప్రజల పక్షాన నిలుస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం ఆటవికపు చర్య అంటూ సంగారెడ్డిలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు. తమ పార్టీ నేతలను నిర్బంధించి... పార్లమెంటులో గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారంటూ ఆరోపించారు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులతో పాటు. రాహుల్ గాంధీకి మద్దతుగా పాదయాత్ర చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా... నల్ల టీ షర్టు ధరించి సుమారు 1000 మంది ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. సంగారెడ్డి పట్టణం లోని క్లాసిక్ గార్డెన్స్ నుండి మొదలుకుని గంజి మైదాన్ వరకు 5 కిలోమీటర్ల మేర ర్యాలీ సాగింది. ప్లకార్డులు ప్రదర్శన, నినాదాలతో కార్యకర్తలు నిరసన ను హోరెత్తించారు.

## జగీర్యాలలో పచ్చదనానికి గ్రామపంచాయతీ ప్రాధాన్యం

ప్రతి కుటుంబం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపు



**అందోల్, జూలై 23 (ప్రజాజ్యోతి):** జగీర్యాల గ్రామాన్ని పచ్చదనంతో నింపే లక్ష్యంగా గ్రామపంచాయతీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. గ్రామ సర్పంచ్ శ్రీమతి ర్యాకల వీరమ్మ, పంచాయతీ కార్యదర్శి పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన పాలక మండలి సమావేశంలో భాగంగా గ్రామ ప్రధాన రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ వీరమ్మ మాట్లాడుతూ.. ప్రతి మొక్కను సంరక్షించడం పాలకవర్గంతో పాటు గ్రామ ప్రజలందరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని పెంచాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెరిగితే గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణంతో పాటు భవిష్యత్ తరాలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోయిని రమేష్, వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశా, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొని మొక్కలు నాటి వాటి సంరక్షణకు కట్టుబడి ఉంటామని తెలిపారు.

## పదవ తరగతి విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ

చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

దాత కొవ్వూరి సాయి ప్రసాద్ రెడ్డి



**శివ్వంపేట ప్రజాజ్యోతి జూలై 23:** హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం శివ్వంపేట మండలంలోని చిన్న గొట్టిముక్ల ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొవ్వూరి సాయి ప్రసాద్ రెడ్డి,విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడిఈ),ప్రతి విద్యార్థికి ఏడు నోటుపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు మూడు రవి నాయక్ మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధికి దాత సాయి ప్రసాద్ రెడ్డి అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన దాతకు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు,తల్లిదండ్రుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ గౌడ్,సుబ్బారెడ్డి,రాజేందర్ రెడ్డి,సత్యనారాయణ,సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## వర్షపు నీరే రేపటి జీవనాధారం.. ఇంకుడు గుంతలే శాశ్వత పరిష్కారం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నీటి సంరక్షణపై ప్రత్యేక అవగాహన

మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్



**తూప్రాన్ (ప్రజాజ్యోతి)జులై 23:** తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల మేరకు తూప్రాన్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో "జల్ సంచయ్ జన భాగీదారి 3.0" కార్యక్రమాన్ని నిర్వహించారు. " క్యాచ్ ద రైన్ " నినాదంతో వర్షపు నీటిని వృథా కాకుండా ఇంకుడు గుంతలు నిర్మించి భూగర్భ జలాలను పెంపొందించేలా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించడం ద్వారా వర్షపు నీటిని సంరక్షించి, రాబోయే తరాలకు నీటి వనరులను అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తూప్రాన్ ప్రభుత్వాసుపత్రిపై వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆగ్రహం

"పేదలకు నాణ్యమైన వైద్యం అందించండి..

వైద్యుల కొరతను వెంటనే భర్తీ చేయాలి"



**తూప్రాన్, (ప్రజాజ్యోతి)జులై 23:** మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆసుపత్రిని సందర్శించిన ఆయన, చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రిలో తగినంత మంది వైద్యులు లేకపోవడంతో రోగులను గజ్వేల్, గాంధీ వంటి ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని విమర్శించారు. వైద్యుల కొరత కారణంగా సాధారణ ప్రసవాలు గణనీయంగా తగ్గిపోయాయని, గర్భిణీలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ప్రభుత్వాసుపత్రుల పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ప్రభుత్వాసుపత్రులను బలోపేతం చేయడంతో పాటు మౌలిక వసతులు, కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ పథకాలతో పేదలకు మెరుగైన వైద్యం అందించామని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వ నిర్లక్ష్యంతో పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించిన ఆయన, వెంటనే ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేసి, అన్ని రకాల వైద్య సేవలు, అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జైపాల్ రాథోడ్, చెలిమెల రాంలు, ఐలేష్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు కొక్కొండ కాశీరెడ్డి, చెలిమెల రఘుపతి, బుక్క విజయ్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్, చక్రవర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటీ విద్యార్థిని సన్మానించిన ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం



**జహీరాబాద్, జూలై 22(ప్రజా జ్యోతి న్యూస్)** మొగుడంపల్లి మండలం రాయిపల్లి తాండకు చెందిన తొగుజాదవ్ (టీచర్) కుమారుడు శ్రీవర్ధన్ జాదవ్ ఐఐటీ మద్రాస్ (చెన్నయ్) యూనివర్సిటీలో సిటు పొందిన చదువు తున్న సందర్భంగా విద్యార్థిని అభినందించి శుభాకాంక్షలు తెలియజేసిన సన్మానించిన ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం, ఈ సందర్భంగా వై.నరోత్తం మాట్లాడుతూ... అన్నిటికీ మూలం విద్యనే అని విద్యార్థి మరింత బాగా చదివి ఉన్నత శిఖరాలను ఎదగాలని ఆకాంక్షిస్తూ నియోజకవర్గానికి రాష్ట్రానికి మంచి పేరు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, యస్.గోపాల్, యం.మల్లేశం, చెంగల్ జైపాల్, యండి. సలీమ్, విద్యార్థి తల్లి దండ్రులు జయశ్రీ తొగు జాదవ్, ఆరుష్ జాదవ్, తదితరులు ఉన్నారు.

# ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలు ఈ దేశ ప్రజల కోసం ప్రాణత్యాగాలు చేశారు.





సంగారెడ్డి (ప్రజా జ్యోతి)

దేశ ప్రజల కోసం ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ప్రాణ త్యాగాలు చేశారని...మరి బీజేపీలో ఎవరైనా దేశం కోసం ప్రాణాలు అర్పించిన వారున్నారా అని ప్రశ్నించారు టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి. నీట్ పేపర్ లీకేజీపై కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు చేస్తున్న ఆందోళనలకు మద్దతుగా సంగారెడ్డిలో వెయ్యి మంది కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి జగ్గారెడ్డి పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో అందరూ బ్లాక్ టీషర్టులు వేసుకుని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
నీట్ పేపర్ లీకేజీతో లక్షల మంది విద్యార్థులు నష్టపోయారన్నారు. ఎగ్జామ్ రాసిన పిల్లల తల్లిదండ్రులకు ఆ బాధ తెలుసని..బీజేపీ పార్టీ నేతల పిల్లలు నీట్ ఎగ్జామ్ రాయలేదేమో..అందుకే వారికి ఆ బాధ కలగడం లేదని విమర్శించారు. సంగారెడ్డిలో ఓ స్టూడెంట్ కి నీట్ ఎగ్జామ్ లో మొదటిసారి 444 మార్కులు వస్తే రెండో సారి రాస్తే 386 మార్కులు వచ్చాయన్నారు. రెండో సారి వచ్చిన ఫలితాలతో ఆ అమ్మాయి నీట్ కి క్వాలిఫై కాలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. దీనికి బాధ్యత ఎవరు వహిస్తారో ప్రధాని మోడీ సమాధానం చెప్పాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. ఇదే అంశంపై జంతర్ మంతర్ దగ్గర విద్యార్థులు ఆందోళన చేస్తే లాఠీలతో చావబాదారని...అందుకే కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు ప్రధాని ఇంటిని ముట్టడించారన్నారు. అసలు ప్రధాని పదవి గాంధీ కుటుంబం నుంచే పుట్టిందని.. అలాంటిది ప్రధాని పదవి వద్దనుకొని వేరే వాళ్ళని ప్రధాని చేసిన ఘనత సోనియాగాంధీకి దక్కుతుందని చెప్పారు. రాహుల్ గాంధీ కుటుంబం దేశ ప్రజల కోసం కోసం ప్రాణాలు అర్పించిందని.. మరి బీజేపీ పార్టీ నుంచి దేశం కోసం ప్రాణాలు అర్పించిన నేతలు ఎవరైనా ఉంటే చెప్పాలంటూ బిజెపి నేతలకు సవాల్ విసిరారు. రాహుల్ గాంధీ చేసే పోరాటం సరైందని..ఆయన పదవుల కోసం పాకులాడే వ్యక్తి కాదన్నారు. రాహుల్ గాంధీ, విద్యార్థులకు మద్దతుగా న్యాయం కోసం పోరాడుతుంటే ప్రధాని, బీజేపీ నేతలు స్పందించకపోవడం సిగ్గు చేటని విమర్శించారు. రాహుల్ గాంధీది ఇచ్చే గుణం అయితే బిజెపి పార్టీది తీసుకునే గుణమన్నారు. ఇది రాజకీయ విమర్శ కాదని వాస్తవాన్ని చెబుతున్నానన్నారు. రాహుల్ గాంధీకి ప్రధాని పదవి ఆఫర్ వస్తే..ఆయన తిరస్కరించి మన్మోహన్ ని పదేళ్ళపాటు ప్రధానిని చేశారన్నారు. మోడీ వేరే వారికి ప్రధాని పదవి ఆఫర్ ఇస్తే వందల మంది క్యూ లో ఉంటారని..అందులో ముందువరుసలో అమిత్ షా ఉంటారని సెటైర్లు చేశారు. ఇది కాంగ్రెస్ పార్టీకి..బీజేపీ పార్టీకి ఉన్న తేడా అని స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీపై ప్రధాని మోడీ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని..విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఉద్యమం ఇంతటితో ఆగదని..రోజుకో రీతిలో నిరసన చేపడుతామని అన్నారు జగ్గారెడ్డి.

## ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ శిక్షణ తరగతులు ప్రారంభించిన ఎంఈవో. బి. సురేష్




**కల్హేర్, జూలై 23. ప్రజా జ్యోతి** కల్హేర్ మండలంలోని ఉపాధ్యాయుల కోసం నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ (ఐటిటీ) రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి (ఎంఈవో) సురేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు బోధనా పద్ధతుల్లో ఆధునిక నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి, విద్యార్థులకు మరింత గుణాత్మక విద్యను అందించడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ యెన్నం నవీన్ రెడ్డి ఉపాధ్యాయులకు బోధనా విధానాలు, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల, కార్యాచరణ ఆధారిత బోధన, మూల్యాంకన విధానాలు తదితర అంశాలపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు ఉపాధ్యాయులు పాల్గొని శిక్షణను ఆసక్తిగా అభ్యసించారు

## నారాయణఖేడ్ నియోజకవర్గంలో రూ.136.97 కోట్లతో రహదారుల అభివృద్ధి పనులకు శ్రీకారం.

## డాక్టర్ పి సంజీవరెడ్డి శాసనసభ్యులు.

**కల్హ్ ర్. 23.జూలై. ప్రజా జ్యోతి** సంగారెడ్డి జిల్లా లోని నారాయణఖేడ్ నియోజకవర్గంలో రహదారి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.136.97 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే డా. పి. సంజీవ్ రెడ్డి తెలిపారు. ఈ నిధులతో మొత్తం 69 కిలోమీటర్ల మేర పలు రహదారుల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

మంజూరైన పనుల్లో ప్రధానంగా:

నారాయణఖేడ్--రాయిపల్లి రహదారి (10 కి.మీ.) అభివృద్ధికి రూ.11.58 కోట్లు,

నారాయణఖేడ్--మాసంపల్లి రహదారి (22.40 కి.మీ.) అభివృద్ధికి రూ.60.57 కోట్లు ,

శంకరంపేట--నారాయణఖేడ్ రహదారి (14.20 కి.మీ.) అభివృద్ధికి రూ.39.00 కోట్లు,

నారాయణఖేడ్--కంగ్టి రహదారి (22.30 కి.మీ.) అభివృద్ధికి రూ.25.82 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు.

ఈ రహదారి పనులు పూర్తయితే ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు



అందుబాటులోకి వస్తాయని అధికారులు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే డా. పి. సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధుల సాధనకు ప్రభుత్వం సహకరిస్తోందని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

## సంత్ గాడ్గే బాబా సేవలు చిరస్మరణీయం

– చాపర్తి కుమార్ గాడ్గే



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 23:** సంత్ గాడ్గే బాబా సేవలు చిరస్మరణీయమని రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే అన్నారు. అబ్బేంద గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గాడ్గే బాబాకు భారతరత్న ప్రకటించి, హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌తో పాటు ఢిల్లీలో ఆయన విగ్రహాలు ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. స్వచ్ఛత, సామాజిక సంస్కరణలు, విద్యా ప్రోత్సాహంలో ఆయన చేసిన సేవలు దేశానికి ఆదర్శమని కొనియాడారు.

## కాంగ్రెస్ వి హింసాత్మక రాజకీయాలు: బీజేపీ నేత సునీల్ రావు

**కరీంనగర్ :** నీట్ పరీక్షను సాకుగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ హింసాత్మక రాజకీయాలకు పాల్పడుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ఆరోపించారు. గురువారం కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో

# సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం కోరుతూ

సంగారెడ్డి (ప్రజా జ్యోతి)
సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం కోరుతూ పార్లమెంటరీ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తో కలిసి సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ఢిల్లీలో కేంద్ర రైల్వే, సమాచార ప్రసారాలు, ఎలక్ట్రానిక్స్ & ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ని కలిసి వినతిపత్రాలు సమర్పించారు. సంగారెడ్డి కోసం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రధాన ప్రతిపాదనలు: ప్రతిపాదిత ముంబై--హైదరాబాద్ హై-స్పీడ్ (బుల్లెట్ ట్రైన్) కారిడార్‌లో సంగారెడ్డిలో బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. హైదరాబాద్‌కు అత్యంత సమీప జిల్లా కేంద్రంగా, వేగంగా అభివృద్ధి చెందుతున్న సంగారెడ్డిలో ఐఐటీ హైదరాబాద్, ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఔషధ పరిశ్రమలు, జాతీయ రహదారులు, రీజినల్ రింగ్ రోడ్ వంటి కీలక మౌలిక సదుపాయాలు ఉన్నాయని వివరించారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంగా వేలాది కుటుంబాలు స్థిరపడుతున్న నేపథ్యంలో ఇక్కడ బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ఏర్పాటు చేస్తే లక్షలాది మందికి ప్రత్యక్ష ప్రయోజనం కలుగుతుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జహీరాబాద్ కోసం ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రధాన ప్రతిపాదనలు:
జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో 'రైల్వే రేక్ పాయింట్' ఏర్పాటు చేసేందుకు అవసరమైన పరిపాలనా, సాంకేతిక చర్యలు చేపట్టాలని కోరారు.
రేక్ పాయింట్ ఏర్పాటు ద్వారా వ్యవసాయ ఉత్పత్తులు, ఎరువులు, ధాన్యం, సిమెంట్, ఉక్కు, ఆటోమొబైల్ ఉత్పత్తులు తదితర పారిశ్రామిక వస్తువుల రవాణా మరింత సులభతరం అవుతుందని వివరించారు.
దీనివల్ల రవాణా వ్యయాలు తగ్గి పరిశ్రమల పోటీతత్వం పెరగడంతో పాటు రైతులు, వ్యాపారులు ప్రత్యక్షంగా లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. అలాగే పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, పారిశ్రామికాభివృద్ధికి ఇది బలమైన ఊతమిస్తుందని తెలిపారు.
అదేవిధంగా హైదరాబాద్--ముంబై హై-స్పీడ్ (బుల్లెట్ ట్రైన్) కారిడార్ డీపీఆర్‌లో జహీరాబాద్ రైల్వే స్టేషన్‌ను చేర్చి,



జహీరాబాద్‌లో బుల్లెట్ ట్రైన్ స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. దేశంలోనే కీలక పారిశ్రామిక కేంద్రంగా ఎదుగుతున్న జహీరాబాద్‌లో 12,656 ఎకరాల్లో నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్, జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ వంటి భారీ ప్రాజెక్టులు అమలవుతున్న నేపథ్యంలో బుల్లెట్ ట్రైన్ స్టాప్ అత్యంత అవసరమని వివరించారు.

ఈ పారిశ్రామికాభివృద్ధి కోసం వేలాది మంది రైతులు భూములు ఇచ్చారని, వారికి దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరేలా ప్రపంచ స్థాయి రవాణా సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.
జహీరాబాద్‌లో బుల్లెట్ ట్రైన్ స్టాప్ ఏర్పాటుతో పారిశ్రామిక పెట్టుబడులు, ఉపాధి, ఎగుమతులు, లాజిస్టిక్స్ రంగాలు మరింత అభివృద్ధి చెందడంతో పాటు తెలంగాణ--కర్ణాటక సరిహద్దు ప్రాంత ప్రజలకు వేగవంతమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని వివరించారు.
వినతిపత్రాలను స్వీకరించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వాటిని సావధానంగా పరిశీలించి, సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యేలు తెలిపారు.

## అవినీతి అనకొండే...

**హైదరాబాద్** : హైదరాబాద్‌లో ట్రాన్స్‌కో డీఈ ముత్యం వెంకటరమణపై ఏసీబీ దాడులు నిర్వహించి ఆదాయానికి మించిన ఆస్తులను భారీగా గుర్తించింది. 9 ప్రాంతాల్లో జరిగిన సోదాల్లో కిలోల కొద్దీ బంగారం.. భారీగా డబ్బు, విలువైన ఆస్తులు, కార్లు, కమర్షియల్ భవనాలు, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన పత్రాలు బయటపడ్డాయి. గతంలో లంచం కేసులోనూ అరెస్టైన వెంకటరమణను ఈసారి అక్రమాస్తుల కేసులో అరెస్ట్ చేశారు. ఈ సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాల ఆధారంగా ఏసీబీ అధికారులు మరింత లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు.తెలంగాణలో అవినీతి అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. దీంతో లంచాలు తీసుకుని అక్రమాస్తులు కూడబెట్టిన అధికారులు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ట్రాన్స్‌కో డిప్యూటీ ఇంజనీర్ (డీఈ) ముత్యం వెంకటరమణ.. ఏసీబీ అధికారులకు చిక్కారు. భారీగా అక్రమాస్తులు గుర్తించడంతో.. ఆయనను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని నివాసంతో పాటు ఆయనకు సంబంధించిన మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. దాదాపు 12 గంటల పాటు సాగిన ఈ తనిఖీల్లో భారీ ఎత్తున అక్రమాస్తులు వెలుగులోకి రావడంతో వెంకటరమణను అధికారులు అరెస్ట్ చేశారు.ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ముత్యం వెంకటరమణ ఆదాయానికి మించి రూ.27.65 కోట్ల విలువైన ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఈ విలువ లెక్కించగా.. బహిరంగ మార్కెట్‌లో ఆస్తుల విలువ రూ. వందల కోట్లలో

## శాన్వి డిఫెన్స్ అకాడమి సేవలు అభినందనీయం మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్** : విద్యార్థులకు విద్యతో పాటు దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందిస్తూ దేశ సేవ దిశగా తీర్చిదిద్దుతున్న శాన్వి జూనియర్ కళాశాల & డిఫెన్స్ అకాడమి అభినందనీయమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. "కమ్ టు లెర్న్? గో టు సర్వ్" అనే నినాదంతో యువతను సైన్యం, రక్షణ రంగం, సామాజిక సేవ వైపు ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. కళాశాల నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మేయర్, విద్యార్థులు కష్టపడి, క్రమశిక్షణతో లక్ష్యాలను సాధించాలని సూచించారు. సామాజిక కార్యకర్త అరెశెట్టి మునిందర్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాటారంలో కాంగ్రెస్ పార్టీ తీవ్ర నిరసన

**జయశంకర్ భూపాలపల్లి** : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం చౌరస్తాలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ కాటారం మండల అధ్యక్షులు వేమునూరి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలపై శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమునూరి ప్రభాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆయన చేసిన కీలక వ్యాఖ్యలు ఇలా ఉన్నాయి నీట్ (యూజీ) పేపర్ లీక్ కారణంగా లక్షలాది మంది

## మిషన్ భగీరథ పంప్ హౌస్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్ పాండు



**రాయికోడ్ జులై 23( ప్రజా జ్యోతి)** సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీ పాండు రాయికోడ్ మండల పరిధిలోని మిషన్ భగీరథ పంప్ హౌస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న కార్మికులతో మాట్లాడి, వారికి వేతనాలు సకాలంలో అందుతున్నాయా, పనిలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే అంశాలపై ఆరా తీశారు. కార్మికులు తమకు అందుతున్న జీతాలు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సరిపోవడం లేదని, వేతనాలను పెంచాలని అదనపు కలెక్టర్‌కు విన్నవించారు. కార్మికుల సమస్యలను శ్రద్ధగా విన్న అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకునేలా పరిశీలిస్తామని తెలిపారు. పంప్ హౌస్‌లోని నిర్వహణ, తాగునీటి సరఫరా వ్యవస్థ పనితీరును కూడా ఆయన పరిశీలించి, ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. వారి వెంట అధికారులు విజయలక్ష్మి,అనిల్,సర్పంచ్ లక్ష్మణ్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ కార్మికుల మే నెల వేతనం వెంటనే చెల్లించాలి

**కలెక్టరేట్ ఏఓ కి సిఐటియూ ఆధ్వర్యంలో వినతి**



**జహీరాబాద్, జూలై 23 ( ప్రజా జ్యోతి న్యూస్ )** మున్సిపల్ కార్మికులకు మే నెల వేతనాలు ఇప్పటి వరకు రాలేదని తక్షణమే విడుదల అయ్యేలా చూడాలని సిఐటియూ ఆధ్వర్యం లో కలెక్టరేట్ లో ఏఓ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ రెక్కాడితే గానీ డొక్కాడని మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెండింగ్ లో పెట్టడం సరైనది కాదని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ట్రెజరీలో పెండింగ్ లో ఉండటం సరైనది కాదని అన్నారు. మే నెల వేతనాలు వెంటనే ఇవ్వాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్, మున్సిపల్ యూనియన్ నాయకులు లక్ష్మీ, మాణిక్, రాజు, తదితరులు పాల్గొన్నారు.